# శవ పరీక్ష

కొడుకు దేవేంద్రభోగం అనుభవిస్తాడన్న ఆశతోనే తండ్రి ఆ పేరు పెట్టాడు. ఈ దేవేంద్రరావు ముద్దుగా పెరిగి మొద్దయినా, తండ్రి ప్రాపకంతో ఒక గుమాస్తా గిరి సంపాదించాడు. ఇక రంభా పూర్వ్యశులను యేలలేదు సరికదా- చీర సింగారించినా చిరిగిన బుట్టలా ఉన్న పెళ్ళాం తన వలపు బరువు మొయ్య లేకపోయింది. ఈ దేవేంద్రుడు ఏమీ తెలియనివాడు కాడు. పోనీ అన్నీ తెలిసిన వాడూ కాడు. చేతిలోని కలాన్ని వజ్రాయుధం చెయ్యకుండా, పాసింజరు బండిలా కదుల్తూ సర్వీసులో రిటైరయ్యేసరికి ఆఫీసు సూపరింటెండెంట్ అనిపించుకుని ఏదో ఒక ఇల్లంటూ కట్టుకుంటే - ఆ కొత్తగా కట్టుకున్న ఇంట్లో పెళ్ళాం యేడ్చి యేడ్చి, తన్నేడిపించి, యీడ్చియీడ్చి తన్ను యీడ్పుల పాలుజేసి, ఎముకల గూడై కొయ్యలా కూర్చుని చనిపోయింది.

ఒక ఎర్రని ఏగానీ అన్యాయార్జితం ఉందా? ఎవరికైనా అపకారం కలలోనైనా తలపెట్టాడా? తాగి తప్పుదారిలో పడలేదు. తాగి వంక దారిలో పోలేదు. సంసారంలో నలిగిపోయినా, సంతానం లేకపోయినా నవ్వే పరాయి ఆడదాన్ని చూసి యేడ్చే మగవాడయ్యాడుగానీ - ఒకసారైనా కన్నుగీటాడా? ఐనా తనకెందుకీ కష్టాలు? శుభమా అని ఇంట్లో దిగితే ఇదేంటీ చావు? ఇల్లాలి రోగాన్ని ఇంటికి రోగంగా మార్చి అందరూ వాస్తుశాస్త్ర పండితులైపోతున్నారు.

ఇదివరకు చావుల గురించి విన్నాడు. ఇప్పుడు ఇంట్లో చావు చూశాడు. నయం - ఇది బలవంతం చావుకాదు లారీ మట్టిన కుక్క కనిపించినా, బస్సు మట్టిన పిల్లి ప్రత్యక్షమైనా ముఖం తిప్పేసే మనిషి తను. రైలు కిందపడ్డ మనుషుల్ని, విషం తాగి చచ్చిన వాళ్ళనూ, మెడలో ఉరితాడు బిగించుకున్న వాళ్ళనూ, కావేశాలతో పొడుచుకొనో, పేల్చుకునో చచ్చేవాళ్ళనూ - ప్రజ్ఞలేని శౌర్యవంతులనీ, పదునులేని కత్తులనీ - అలంకారాలతో కదిలే శవాలనీ అసహ్యించుకునేవాడు.

పెళ్ళాం చావు మరిచిపోయి, ఇంటిలో ఒంటరిగా సుఖం అనుభవిస్తుంటే, ఒక రోజు ఉదయాన్నే కెవ్వున కేక! హృదయం స్పందించే రోదన! పరుపు మీద నించి లేచి కిటికీ తెరచి చూస్తే, ఆ తూర్పు దిక్కుకు పచ్చని మామిడి చెట్టుకు వ్రేలాడుతున్న శవం. ఉరితాడుతో ప్రాణాలను తీసుకున్న మగవాడు. ఆమె గొంతుక మీదనున్న అభిమానంతో దేవేంద్రరావు అటువేపు పరుగెత్తాడు.

''నా మూర్తీ, నా సత్తె మూర్తీ! మంచిలో ఈదుతూ మునిగిపోయావు. బెడదలో పడకుండా పోయావు.''

సీతారత్నం తలచి తలచి యేడుస్తోంది. సత్యమూర్తి చచ్చినా ఇంకా సన్నంగానే ఉన్నాడు. ఆ తీక్షణమైన కళ్ళతో ఇంకా చూస్తున్నట్లే ఉంది. చదువు కున్న చలిచీమలా చావటానికి రెక్కలు కట్టుకుని చెట్టుమీది కెగిరి ఉరిపోసు కున్నాడు. తనను ఈ పరిస్థితికి తెచ్చిన పాముల్లో, ఒక పాముకైనా కుట్టి చావలేదు. రోజుకోసారి తిన్నా, సీతారత్నం చింతలేని చింతచెట్టులా పచ్చగా ఉంది. నడక, చూపు, తలపు, వలపు, మాటా మంచీ - అన్నీ నిటారుగా, బింకంగా నిల్పోబెట్టాయి. ఆ యేడుపులో దైన్యంలేదు ఎవరి మీదా నిష్ఠూరాలు వెయ్యలేదు. ఎదుటి వాళ్ళ కనికరానికి ప్రాకులాడలేదు. ఆమె మీద పేరుకున్న అభిమానంతో దేవేంద్రరావు వకాల్తా తీసుకున్నాడు శవ దహనానికి ఇంటింటికీ చందాలకు బయలుదేరాడు. సత్యమూర్తి పాక అద్దె కొంప. దానిని అద్దెలకోసం బంజరు భూమి ఆక్రమించి కట్టించిన ఆసామీ భవనంలో ముందు కాలు పెట్టాడు. వార్త వినగానే లోకనాథం - ''అయ్యో పాపం! పోయాడా?'' అన్నాడు.

ఏభయి రూపాయ లిచ్చి ముందు తన పేరు లిష్టులో వేశాడు. అతను వెళ్ళిపోగానే అంతవరకు గుసగుసలతో విసవిసలాడుతున్న పెళ్ళాం విజృంభిస్తే—

''ఒసే! పీడా వదిలిందే. ఒక నెల సరిగ్గా అద్దె ఇచ్చాడా, చచ్చాడా? ఆ ఒక్క ఆడకూతురు ఆ ఇంట్లో ఒంటరిగా ఉంటుందా? ఇక అద్దె పెంచి అడ్వాన్సు పుచ్చుకుని మరీ ఇస్తాను.''

ఇక ఆఫీసరు అదిశేషయ్య.

''లోకనాథం యేళయ్యిచ్చాడా? తెగించాడే. ఈ సత్యమూర్తి నా దగ్గరికి ఉద్యోగం గురించి వచ్చాడు ఎంప్లాయిమెంటు ఎక్చేంజి నించి పేరు తెచ్చుకోమంటే పెదివి విరిచాడు ఇలాంటివి ఆలస్యం అవుతాయి. వోర్పు లేని మనిషి వళ్ళు తెలియని పని చేస్తాడనుకున్నాను. అంతే జరిగింది.''

ఇంత విన్నాక ఇంకొకాయన అడిటరు.

''ఎందరో చస్తుంటారు. అందులో బలవంతంగా చచ్చిన వాళ్ళ మీద నాకు సానుభూతి లేదు. సరే మీరు స్వయంగా వచ్చారు కాబట్టి కాదన లేను. అంతా జరిపించాక చందా ఇచ్చిన వాళ్ళకి లెఖ్ఖలు అప్పజెప్పే బాధ్యత ఉందని గుర్తించారా?''

' బాగా సెలవిచ్చారు. ఆ పని చెయ్యకుండా ఉండలేను.''

ఇలా ఎక్కిన గడప ఎక్కకుండా, విసుక్కోకుండా చెప్పిందే చెబుతూ, వినయంగా నచ్చ చెప్పి డబ్బు కూడ జేసుకుని వచ్చేసరికి పోలీసులు రానే వచ్చారు. వెతగ్గా వెతగ్గా పాకలో చిన్న ఉత్తరం ముక్క దొరికింది.

''బతుకంటే విసిగిపోయాను. ఈ పనికి బాధ్యత నాదే.''

''అయ్యా! అతని స్వదస్తూరితో రాసిన ఉత్తరం దొరికింది కదా? దయ చేసి పంచాయతీ చేసి శవం దహనానికి ఇప్పించండి.'' మర్యాదగా అడిగాడు పోలీసు పెద్దు కానిస్టేబులును.

''బలవంతం సావు యెనకాలే ఎంతో కతుంటాది. ఆ కత యివరంగా తెలుసుకోవాలంటే శవపరీక్ష సెయ్యాలసిందే?" అరిచినట్లు పెద్దు అనగానే, సీతారత్నం గొంతు కెక్కింది.

''నా సత్తెమూర్తో! నీది యెత్తేసిన యాపారం కాదు. దిగేసిన యాపారం కాదు. నివ్వు లెక్కల్లో మనిషివి. బతికుండగానే నిన్ను కోసేసినారు. సచ్చాక కూడా నిన్ను కోస్తారట బాబో!'' అంటూ పరుగెత్తుకుని దేవేంద్రరావు దగ్గర కొచ్చి కూలబడి పోతూ—

''ఏనాడు యాదీ కోరలేదు. ఇదొక్క కోరిక మన్నించాల. నా మూర్తిని కొయ్యకండి బాబో! మేకని కోసినట్టు కొయ్యకండి బాబో! మీకు పున్నెముంటాది'' అని ఏడ్చింది.

ఇది ఆమె గొప్ప కోర్కె అని, జీవితంలో బహుశః ఒకే కోరిక అని తట్టగానే పోలీసు పెద్దతో—

''అయ్యా! ఆతను నిరుద్యోగండి. చదువుకున్నా గడింపు లేదని ఇంత పని చేశాడేమో? ఆమె గోడు విన్నారు కదా!" అన్నాడు.

''మా రూల్సు మా రూల్సే.''

''అసలు దహన సంస్కారాలు ఈ కాలనీలో దండుకుని మరీ చేస్తున్నాం. ఆలోచించండి'' అనగానే హెడ్డు అంత దూరం ఒంటరి జాగాకు వెళ్ళాడు. ఇల్లు కట్టాక ఇలాంటి ఒంటరి జాగాలకు జరిగే వాళ్ళ మనస్తత్వం తెలుసుకున్నాడు కాబట్టి దగ్గరగా వెళ్ళాడు.

''ఎంత?'' అడిగాడు హెడ్డు.

''లంచమా?''

''రూలుకు యెతిరేకంగా యెల్తున్నానంటే అర్థం యేటి? సాహసం! బహుమతికి లంచం అంటున్నావేటి సంగతి?''

"వాళ్ళకెవరూ లేరండి. ఆ ఆడదాని ముఖమైనా చూసి కనికరించండి."

''ఆ ఆడమనిషికి నట్ లూజుగా ఉందా?''

''ఆవిడ అసభ్యమైన కోరిక కోరలేదు.''

''ఇది అసలు పెళ్ళామా అని?''

''అలా మీ కంటికి కనపడలేదా?''

''ఇది స్టెపినీ అని అనుమానంగా ఉంది.''

''నిజం తెలుసుకోకుండా అలా అనుమానపడకండి.''

''నేరం నంగనాచిలా ఉంటాది. ఎన్ని నంగనాచుల్ని ఈదిలో కీడ్చకుండా యెడ్డు నయ్యానయ్యా. సరే, ఏగం తేల్చు.''

''అంత ఇచ్చుకోలేం.''

''ఇదంతా నా జేబు కెలిపోతా దనుకుంటున్నావేటి? తగ్గిస్తే నాకేం మిగలదు. పుచ్చుకోకుండా శవం వదిలేస్తే నానే రెట్టుకోవాలి.''

మూడు వందలకు సెటిల్ అయింది. శవపరీక్ష కెళ్ళకుండా ఆ సాయంత్రం సరికి శవదహనం అయిపోయింది.

ఆడిటర్ అనంతయ్య శవం దరిదాపుల్లోకి రాకపోయినా, అతనే నిత్యం మనసులో మెసలు తుండటం వలన ఒక ఆదివారం ఉదయం చందా లిచ్చిన ఉదారులందరినీ తన ఇంట్లో దేవేంద్రరావు పోగు చేశాడు.

టీ సేవించాక ఒకాయన—

"అందరూ సంఘసేవ చెయ్యలేరండి. మీరు చేబట్టి ఒక అనాథ కుటుంబానికి సహాయం చేశారు. భేష్!" అన్నాడు. మర్యాదలూ మంచి మాటలయ్యాక జమ ఖర్చుల పత్రం చదివి వినిపించాడు. ఆఫీసరు ఆదిశేషయ్య లేచి—

"అయ్యా! అంతా బాగుంది కానీ, పోలీసోడికి లంచం ఇవ్వడం నేను అంగీకరించను."

అతన్ని బలపరుస్తూ శేషగిరి—

"నేనిచ్చిన డబ్బులో లంచాల డబ్బులేదు. ఎవర్నడిగి ఈ పని చేశారు?" అన్నాడు.

"ఎవర్ని అడగటానికి ఎవరు శవం దగ్గరకు వచ్చారని?"

"చచ్చినవాడు చందాలతో దహనం అవుతున్నాడని పోలీసులకు చెప్పలేక పోయారా?"

"అలా చెప్పడం వల్లే వాడు పట్టిన పట్టు వదల్లేదు."

"ఏంటా సెంటిమెంటు? మీరు దానికి తల ఒగ్గడం బాగాలేదు. ఆ డబ్బుతో రెండు నెలలు ఆమె బతగ్గలిగేది."

"ఆమె యేడుపూ, కోరికా బలమై పోయాయి. అందుకే తల ఒగ్గాను" అన్నాడు దేవేంద్రరావు వినయంగా.

"ఏంటో, ఇదంతా నమ్మ తగ్గదిగా లేదు" అని అనంతయ్య అనగానే శరీరం కంపరమెత్తి "నేను జేబులో వేసుకున్నానని అనుమానమా?" సూటిగా ప్రశ్నించాడు.

"అది కాదండీ! మనమే ఇలాంటి నీచానికి పాల్పడి సంఘానికి ద్రోహం తలపెట్టుతున్నాము కదా. అందులో పోలేసోడికి లంచం. వాట్ ఏ షేమ్?"

"ఇతనితో మీ రంతా ఏకీభవిస్తున్నారా?"

అనగానే అందరూ మవునంతో అంగీకారాన్ని సూచించగానే దేవేంద్రరావు లేచిపోయి—

"ఇక్కడ చేరిన వారెవరూ లంచాలు పుచ్చుకోనివారే. కాదనను. కాని ఒక్క మాటంటాను. చెయ్యగలిగి చెయ్యకపోయినా అవినీతే అంటాను. మన దగ్గరలో ఉన్న సత్యమూర్తి బతకడానికి చెయ్యగలిగి చెయ్యని వాళ్ళ గురించి ఏమంటారు?"

ఆఫీసరు ఆదిశేషయ్య ఇది తన మీదే విసిరిన సవాలుగా తీసుకుని "నన్నేం చెయ్యమంటారు? పేరు లిస్టులో వెయ్యించుక రమ్మన్నానా?"

"సత్యమూర్తి ఎలాగు తెచ్చుకో లేదని మీకు తెలుసు. మీరు తెప్పించ గలరు. ఆ అవకాశం వీడి కివ్వకుండా మీ చుట్టం కోసం దాచుకున్నారు కదా!"

"మీకు తోచినట్లు అనుకునే స్వతంత్రం ఉంది లెండి. ఆకలితో చచ్చిపోక కనిపిస్తుండు అన్నాను. రోషం తక్కువా?"

"ఎవరికి లేదండీ రోషం? మన అందరికీ ఉంది. అయినా మనలో ఎంత మంది సినిమా టికెట్లు బ్లాకులో కొనలేదు. రైలు సీట్లకోసం లంచం ఇవ్వలేదు. స్కూల్లో కాలేజీలో సీట్లకోసం, కూతుళ్ళ పెళ్ళిళ్ళకోసం, ఉద్యోగాల కోసం ఈ సంఘంలో బతకడానికి కిరాణాసామానులూ, కూరగాయలే కాదు - అన్నీ కొనుక్కోవాలి. అంతా వ్యాపారమే. దగా, మోసంతో కూడుకున్న బిజినెస్."

"నాలో అంతరాత్మ చావలేదింకా" అని ఎవరో అరిచాడు వెనకనించి.

"మన సౌకర్యాలకు అంతరాత్మ కవాటాలు మూసేస్తాం. ఎదుట వాళ్ళ విషయంలోనే ఆ తలుపులు తెరుస్తాం."

ఈ సూటి మాటలు నచ్చని అనంతయ్యా లేచిపోయి, "ఈ సంఘాన్నే శవాన్ని చేసి శవ పరీక్ష చేసేస్తున్నాడు." చెంప పెట్టి కొట్టినట్లు అరచి బయటకు త్రోసుకుంటూ పోయాడు.

"ఇదేదో మీరు పెద్ద సాహసం చేసినట్లు మురిసిపోకండి" అంటూ ఆది శేషయ్యా వెకిలిగా నవ్వుతూ కదలాడు.

"మీ దృష్టిలో ఆవిడదే నోబుల్ డిజైర్! మా డబ్బు లంచానికి కాదన్న మా కోరిక సబబైనది కాదు కదూ? స్వామివారి హుండీలో వేసినా సద్వినియోగమయ్యేది" అన్నాడింకో ఉదారుడు వెళ్ళిపోతూ.

ఇలా ఎవరి మనసుకు వచ్చినట్లు వాళ్ళు అడ్డూ ఆపూ లేకుండా వాగుతూ వెళ్ళిపోయారు. ఈ మాటలతో తన్ను ఖూనీ చేసినట్లే శవంలా మంచం మీద పడిపోయాడు. ఆ బాధతో సతమతమై సాయంత్రం సరికి కదలిక వచ్చింది. ఆ కదలిక తెప్పించింది వాళ్ళన్న ఎత్తి పొడుపు మాటల్లో నున్న నిజానిజాల అన్వేషణ. అలా అన్వేషించడం ఒక సాహసం ఆ సాహసంతో లేచి ఎప్పుడూ కప్పివేసి ఉండిన పడకగది కిటికీలు బాహాటంగా తెరచాడు. కట్టిన కిటికీ గుడ్డలను ప్రక్కకు లాగేశాడు. చక్కిలిగింతలు పెట్టినట్లు గాలి వీచింది. తెల్ల మబ్బుల చాటునించి ఒక చుక్క మెరుస్తోంది. తను యే నక్షత్రాన పుట్టాడో గాని తన జీవితంలో కోరుకున్న దేదీ సరిగ్గా జరగలేదు. ముఖ్యంగా-

కలకలారావాలు చిలుక పలుకులై
చక్కని చెక్కిళ్లు చిగురాకు కొమ్మలై
అప్పగించిన మేను చెలరేగి
తనివితీరా కోరికలను తలరించే ఆడది దొరకలేదు.

తన భార్య అలివేలు తీర్చని కోరిక ఎవరు తీర్చారు? తన పడక గదిలో తూర్పు వేపు ఎపుడూ మూసివేసిన కిటికీ, ఆ కిటికీ తలుపుల్లో ఒక తలుపుకు చిన్న కన్నం ఉంది. ఆ కన్నం నించి చూస్తే—

పాకకు ఆనుకుని ఉన్న చిరిగిన తడికల బాతురూము - రోజూ ఉదయం నగ్నంగా స్నానం చేసే సీతారత్నం. ఎదురుగా నిల్చుంటే సిగ్గుతో ప్రక్కకు తప్పుకునే వాడేమో కానీ, ఈ స్వేచ్ఛలో - ధగధగ మెరిసే ఆ రత్నాన్ని చూస్తూంటే కరుడు కట్టిపోయిన కామం కరిగి శరీరమంతా ఉరకలు వేసేది. ఈ దేవేంద్రుడు ఆ రంభను ఈ కన్నంనించి తిలకించి ఆనందించాడు ఊహల్లో అనుభవించాడు.

వెన్నెల్లో - ఆ మామిడి చెట్టు క్రింద, చిరిగిన చాపమీద, ఆ జంట చిద్విలాసాలు ఈ కన్నులనించే చూసి - కోణార్క మిథున విగ్రహాలకు ప్రాణాలొచ్చి యెదురైనట్లు తబ్బిబ్బయిన వాడికి - ఈ క్షణంలో కిటికీలు తెరచి బాహాటంగా చూస్తుంటే ఒక సందేహం వచ్చిపడింది.

అంత అన్యోన్యంగా ఉండి, అంత శరీర సుఖాన్ని పొందిన సత్యమూర్తి ఎందుకు ఉరేసుకుని చచ్చాడు?

తిండీ బట్టా పెట్టలేక తన అర్భకమైన శరీరంతో ఆమె అపురూపమైన వలపు లోతుల్లో యీదలేక, అలసి సొలసి మునిగిపోయాడా? ఒక అద్భుతమైన స్త్రీకి చేస్తున్న అన్యాయానికి సహించలేక ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారణకి వచ్చాడు.

ఇన్నాళ్ళూ తనకు ప్రేమించడం చేతకాలేదని తట్టింది. ప్రేమించడమే చేతనైతే పెళ్ళాం ఎందుకేడ్చేదో, ఎందుకు ఈడ్పుల పాలైందో కనీసం సానుభూతితోనైనా ఆలోచించలేదే! తనూ అలంకారాలతో కదిలే శవమై పోయాడు. తన శవాన్ని తనే పరీక్షించుకున్నా డిప్పుడు!

రెండు రోజులు ప్రయత్నించి అప్పుచేసి ప్రోగుచేసిన చందా డబ్బులను త్రిప్పి ఇచ్చాక గానీ, తను సజీవంగా కదులుతున్నానన్న భావన రాలేదు. *

(1983)